సాక్షి కరీంనగర్

శుక్రవారం | 10 | నవంబర్ | 2023

మీకు తెలుసా

ఏ-ఫాం.. బీ- ఫాం అంటే?

కరీంనగర్ అర్బన్: ఎన్నికలొచ్చాయంటే ఏ-ఫాం, బీ-ఫాం పదాలు చర్చకొస్తుంటాయి. పార్టీ తరఫున ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేసే పత్రమే బీ-ఫాం. తమ పార్టీ నుంచి ఫలానా వ్యక్తి పోటీపడుతున్నారని, పార్టీ గుర్తు కేటాయించాలని అభ్యర్థించడమే ఈ పత్రం ముఖ్య ఉద్దేశం. ఇక ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థిని ధ్రువీకరించేందుకు పార్టీ జాతీయ అధ్యక్షుడు, రాష్ట్రస్థాయిలో ఒకరికి అధికారం అప్పగిస్తారు. ఈ ప్రక్రియనే ఏ-ఫాం కాగా.. అధికారం పొందిన వ్యక్తి అభ్యర్థికి బీ-ఫాం జారీ చేస్తారు. రాష్ట్రస్థాయి గుర్తింపు పొందిన పార్టీ అధ్యక్షుడు తాను లేదా మరొకరికి లేదా జిల్లాస్థాయిలో ఒకరికి బీ-ఫాం జారీ చేసే అధికారాన్ని అప్పగిస్తుందని ఏ-ఫాం సూచిస్తుంది. ఏ-ఫాం ద్వారా అధికారం పొందిన వ్యక్తి పోటీచేసే అభ్యర్థికి బీ-ఫాం ఇస్తారు. ఏ-ఫాం, బీ-ఫాం పత్రాలు నామినేషన్ దాఖలు సమయంలో లేదా నామినేషన్ చివరి రోజు మధ్యాహ్నం 3గంటల్లోగా సంబంధిత రిటర్నింగ్ అధికారికి అందించాలి.

నామినేషన్ల వివరాలు.. 6వ రోజు

నియోజకవర్గం	నామినేషన్లు	సెట్లు
కరీంనగర్	04	03
హుజూరాబాద్	12	12
మానకొండూర్	09	12
చొప్పదండి	07	09

న్యూస్‌రీల్

విద్యార్థులకు ఉచితంగా న్యాయసేవలు



కొత్తపల్లి(కరీంనగర్): విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగిఉండాలని, అవసరమైన వారికి ఉచితంగా న్యాయసలహాలు అందిస్తామని జిల్లా సీనియర్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ కె.వెంకటేశ్ తెలిపారు. కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ లీగల్ సర్వీసెస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యాయ సలహాలు, సూచనలు, చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్‌క్రైం, ఆర్టీఐ, వరకట్నం, మోటార్ వెహికిల్, పోక్సో, గృహహింస చట్టం వంటి అంశాలపై వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో 100 లేదంటే 1098కు కాల్ చేయాలన్నారు. అనంతరం వెంకటేశ్‌ను ఉపాధ్యాయులు సత్కరించారు. న్యాయవాదులు ఎ.శ్రీనివాస్, కె.సంపత్, ఇన్‌చార్జి హెచ్‌ఎం టి.విద్యాసాగర్ రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా రేకుర్తిలోని మైనారిటీ బాలికల రెసిడెన్షియల్ స్కూల్‌లో సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్ అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ మోనికా సోనీ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రగతి చక్రం అవార్డులు



విద్యానగర్(కరీంనగర్): ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని డిపోల్లో 2023–24 ఆర్థిక సంవత్సర ద్వితీయ త్రైమాసికంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 28మంది ఉద్యోగులకు గురువారం కరీంనగర్ బస్‌స్టేషన్‌లోని సమావేశ మందిరంలో ప్రగతిచక్రం అవార్డులు అందజేసి కరీంనగర్ రీజినల్ మేనేజర్ ఎస్.సుచరిత వారిని సన్మానించారు. రూ.750 నగదు, బహుమతి, ప్రశంసాపత్రం అందించారు. ఉత్తమ బస్‌స్టేషన్‌గా ఎంపికైన వేములవాడ బస్‌స్టేషన్‌కు రూ.5 వేల నగదు అందజేశారు. డిప్యూటీ రీజినల్ మేనేజర్(ఆపరేషన్స్) ఎస్.భూపతిరెడ్డి, డిప్యూటీ రీజినల్ మేనేజర్ (మెకానికల్) కె. సత్యనారాయణ, ఎం.చంద్రయ్య పాల్గొన్నారు.

వైద్యులు సమయపాలన పాటించాలి



కరీంనగర్‌టౌన్: అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్లలోని ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్లు సమయపాలన పాటించి, రిజిస్టర్లు అన్ని అందుబాటులో ఉంచాలని జిల్లా వైద్యాధికారి లలితాదేవి సూచించారు. గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్లకు, ఎన్‌హెచ్‌ఎం మరియు వైద్యశాఖలోని, వివిధ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్‌సీడీ ప్రోగ్రాంలో భాగంగా ప్రతీఒక్కరికి అబాకార్డ్ జనరేట్ చేసి, ఈ–సంజీవని కాల్స్ చేయాలని తెలిపారు. ఎన్‌సీడీ క్యాంపు నిర్వహించి, హైరిస్క్ కేసులను గుర్తించి, హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌కు రెఫర్ చేయాలని సూచించారు. సబ్ సెంటర్లలోని గర్భిణులను గుర్తించి, నమోదు చేయించాలని, సాధారణ కాన్పులను ప్రభుత్వ ఆస్పత్రుల్లో జరిగేలా చూడాలని తెలిపారు. దగ్గు, స్వల్ప జ్వరం, ఛాతీనొప్పి గల వారిని గుర్తించి శాంపిల్స్ సేకరించి, క్షయ వ్యాధి నిర్ధారణ కోసం పంపించాలని కోరారు. అదనపు డీఎంహెచ్‌వో సుజాత, డీటీసీవో రవీందర్‌రెడ్డి, డీఐవో డాక్టర్ సాజిదా పాల్గొన్నారు.

క్వింటాల్ పత్తి రూ.7,100



జమ్మికుంట: జమ్మికుంట పత్తి మార్కెట్లో క్వింటాల్ పత్తి గరిష్ఠంగా రూ.7,100 పలికింది. మార్కెట్‌కు ఆరు వాహనాల్లో 65 క్వింటాళ్ల పాతపత్తిని ఆరుగురు రైతులు అమ్మకానికి తెచ్చారు. మోడల్ ధర రూ.7,000, కనిష్ఠ ధర రూ.6,860 పలికింది. 108 వాహనాల్లో 959 క్వింటాళ్ల కొత్త పత్తిని తేగా.. గరిష్ఠ ధర రూ.6,800, మోడల్ ధర రూ.6,400, కనిష్ఠ ధర రూ.6,000కు కొనుగోలు చేశారు. గన్నీసంచుల్లో 32మంది రైతులు 59 క్వింటాళ్ల పత్తిని తెచ్చారు. గరిష్ఠ ధర రూ.6,500, మోడల్ ధర రూ.6,200, కనిష్ఠ ధర రూ.6,000కు ఖరీదు చేశారు. మార్కెట్‌కు 11 వాహనాల్లో 11 మంది రైతులు తెచ్చిన 110.65 క్వింటాళ్ల పత్తిని సీసీఐ కొనుగోలు చేసింది. గరిష్ఠ ధర రూ.7,020, మోడల్ ధర రూ.6,900, కనిష్ఠ ధర రూ.6739 పలికింది. క్రయవిక్రయాలను కార్యదర్శి గుగులోతు రెడ్డినాయక్ పర్యవేక్షించారు.

వస్తా మీ వెనకా..



- పతికి మద్దతుగా సతి
- డమ్మీ నామినేషన్ వేసిన ఎమ్మెల్యే అభ్యర్థుల సతీమణులు
- కోరుట్లలో బీఆర్‌ఎస్ అభ్యర్థికి తండ్రి..
- ఉమ్మడి జిల్లాలో ఇప్పటివరకు 314 సెట్లు దాఖలు

సాక్షిప్రతినిధి,కరీంనగర్:

రాజకీయాల్లో నమ్మకం అనేది చాలా విలువైనది. ఏమాత్రం అవకాశం దొరికినా.. వెన్నుపోట్లు ఎదురవుతాయి. అందుకే, ప్రతీ నాయకుడు తాను వేసే అడుగుల్లో ముందు తన కుటుంబసభ్యులే నడవాలని కోరుకుంటారు. నామినేషన్ వేసే దశ నుంచే ఈ మేరకు ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటారు. అభ్యర్థులు ఎన్నికల సంఘానికి సమర్పించే నామినేషన్ అఫిడవిట్‌లో సమస్యలు తలెత్తే అవకాశాలు లేకపోలేదు. అలాంటి సమయంలో నామినేషన్ తిరస్కరణకు గురయ్యే అవకాశాలుంటాయి. ఈ క్రమంలో ముందుచూపుతోనే ఒకప్పుడు నాయకుడు తమకు నమ్మకస్తులైన అనుచరులతో డమ్మీ నామినేషన్ వేయించేవారు. రానూరాను రాజకీయాల్లో వెన్నుపోట్ల సంప్రదాయం పెరిగిపోవడంతో నేతలు కుటుంబసభ్యులతోనే డమ్మీ నామినేషన్ వేయిస్తున్నారు. అంతా బాగుంది అనుకున్న తర్వాత తమవారి కోసం తిరిగి నామినేషన్ ఉపసంహరించుకుంటారు.



- ఈటల: హుజూరాబాద్ బీజేపీ అభ్యర్థి, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ సతీమణి జమున ప్రతీ ఎన్నికల సందర్భంగా డమ్మీ నామినేషన్ వేస్తున్నారు. గతంలో ఇలా ఏడుసార్లు వేశారు. ఇప్పుడు కూడా డమ్మీ నామినేషన్ వేశారు.

జంగ్ తెలంగాణ

నామినేషన్లకు నేడే ఆఖరు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో 214 మంది అభ్యర్థులు మొత్తం 314 సెట్ల నామినేషన్లు వేశారు. ఏకాదశి కావడంతో గురువారం భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. నేటి(శుక్రవారం)తో గడువు ముగియనుండటంతో మరిన్ని నామినేషన్లు రావొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

నియోజకవర్గం	అభ్యర్థులు	వచ్చిన నామినేషన్లు
కరీంనగర్	17	25
చొప్పదండి	10	15
మానకొండూర్	15	23
హుజూరాబాద్	23	34
సిరిసిల్ల	14	23
వేములవాడ	15	20
పెద్దపల్లి	22	31
రామగుండం	19	24
మంథని	13	21
జగిత్యాల	37	60
కోరుట్ల	16	21
ధర్మపురి	13	17
మొత్తం	214	314



- కవ్వంపల్లి: కాంగ్రెస్ అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణ భార్య అనురాధ నామినేషన్ వేశారు. మానకొండూరు నుంచి ఈసారి ఎలాగైనా గెలవాలని కవ్వంపల్లి దంపతులు సర్వశక్తులు ఒడ్డుతున్నారు.



- పుట్ట: బీఆర్‌ఎస్ మంథని అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు సతీమణి, మున్సిపల్ చైర్‌పర్సన్ శైలజ ఆయనకు డమ్మీగా నామినేషన్ వేశారు. ఇలా వేయడం ఇది మూడోసారి.



- ఆది: కాంగ్రెస్ వేములవాడ అభ్యర్థి ఆది శ్రీనివాస్ సతీమణి వనజ నామినేషన్ వేశారు. గతంలో చందుర్తి జెడ్పీటీసీ సభ్యురాలిగా పనిచేసిన ఆమె ఇప్పటివరకు నాలుగుసార్లు ఇలా వేశారు.



- చల్లా: మంథని బీఎస్పీ అభ్యర్థి చల్లా నారాయణ రెడ్డి ప్రస్తుతం కాటారం పీఏసీఎస్ చైర్మన్‌గా ఉన్నారు. ఆయనకు డమ్మీ అభ్యర్థిగా భార్య సుజాత నామినేషన్ వేశారు. ఈమె గతంలో జెడ్పీటీసీ సభ్యురాలిగా పని చేశారు.

- కల్వకుంట్ల: కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు వారసుడిగా ఆయన కుమారుడు సంజయ్ ఈసారి ఎన్నికల బరిలో ఉన్నారు. కుమారుడికి రాజకీయాలు కొత్త కావడంతో తండ్రే అన్నీ తానై చూసుకుంటున్నారు. ఎందుకైనా మంచిదన్న ఆలోచనతో తానే డమ్మీగా నామినేషన్ కూడా వేశారు.



ఓట్ల లెక్కింపునకు ముందుగానే ఏర్పాట్లు



ఎస్సారార్ కళాశాలలో కౌంటింగ్ ఏర్పాట్లు పరిశీలిస్తున్న పమేలా సత్పతి, సీపీ అభిషేక్ మహంతి

- జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి

కరీంనగర్ అర్బన్: శాసనసభ ఎన్నికల క్రమంలో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల కౌంటింగ్‌కు ఎస్సారార్ కళాశాలలో కావాల్సిన ఏర్పాట్లు ముందుగానే సమకూర్చుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. ఎస్సారార్ డిగ్రీ కళాశాలలో అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్‌కు చేపట్టిన ఏర్పాట్లను గురువారం సీపీ అభిషేక్ మహంతితో కలిసి పరిశీలించారు. స్ట్రాంగ్‌రూం, కౌంటింగ్ కేంద్రాలు, ఇతర ఏర్పాట్లు పరిశీలించారు. ఈ నెల 30న పోలింగ్, డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు ఉంటుందని అన్నారు. కౌంటింగ్‌కు ముందుగానే ఏర్పాట్లను సమీక్షించుకోవాలని, ప్రతీ నియోజకవర్గానికి చెందిన ఎంట్రీ, ఎగ్జిట్ వేర్వేరుగా ఉండాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, ఏసీపీ ప్రతాప్ పాల్గొన్నారు.

30న వేతనంతో కూడిన సెలవు

ఎన్నికల పోలింగ్ క్రమంలో ఈ నెల 30న ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలకు వేతనంతో కూడిన సెలవును ప్రకటిస్తూ ప్రభుత్వం జీవో జారీచేసిందని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. వేతనంతో కూడిన సెలవు ప్రకటించినందున కరీంనగర్, మానకొండూర్, హుజూరాబాద్, చొప్పదండి నియోజకవర్గాలలో ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని జిల్లాలో వందశాతం ఓటింగ్ జరిగేలా సహకరించాలని ఒక ప్రకటనలో కోరారు.

ఏఆర్ పోలీసులతో సీపీ దర్బార్

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కేంద్రంలో గల జాన్ విల్సన్ ఓపెన్ థియేటర్‌లో గురువారం సాయుధ దళ పోలీసుల్లోని పలు విభాగాలకు చెందిన సిబ్బందితో సీపీ అభిషేక్ మహంతి దర్బార్ నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాబోయేరోజుల్లో ప్రత్యేక విధులు, చెక్‌పోస్ట్, పికెట్స్, అబ్జర్వర్లలకు వ్యక్తిగత భద్రత సిబ్బందిగా, పలు ముఖ్యమైన విధులు కేటాయించబడతాయని వివరించారు. వాటిని నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలని అన్నారు. పారదర్శకంగా ఎన్నికల విధులు నిర్వహించడంలో తమవంతు సహకారం అందించాలని అన్నారు. చేసే ప్రతీ మంచి పనికి రివార్డు అందిస్తామని తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అడిషనల్ డీసీపీ సి.రాజు, ఏసీపీ ప్రతాప్, ఆర్‌ఐలు సురేశ్, రజనీకాంత్, శ్రీధర్ రెడ్డి, శేఖర్ బాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీ అభిషేక్ మహంతి

నేరుగా వచ్చి ఫిర్యాదు చేయండి

- ఎన్నికల సాధారణ పరిశీలకులు రవికుమార్, ప్రసన్న

కరీంనగర్ అర్బన్: అసెంబ్లీ సాధారణ ఎన్నికల దృష్ట్యా మానకొండూరు, హుజూరాబాద్ నియోజకవర్గాలకు సంబంధించిన ఫిర్యాదులు సాధారణ ఎన్నికల సాధారణ పరిశీలకులు యం.ఆర్.రవికుమార్‌కు, కరీంనగర్, చొప్పదండి నియోజకవర్గాలకు డాక్టర్ సీఆర్.ప్రసన్నకు తెలియజేయాలని వారు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. కోడ్ ఉల్లంఘనలు, ఫిర్యాదులు ఏమైనా ఉన్నట్టైతే వాటిని స్వయంగా స్వీకరించడానికి ఉదయం9 గంటల నుంచి 11 గంటల వరకు కరీంనగర్‌లోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో అందుబాటులో ఉంటానని రవికుమార్ పేర్కొన్నారు. అలాగే ఫోన్ నంబర్ 8121292341 ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఫిర్యాదులు స్వయంగా స్వీకరించడానికి ఉదయం 9.30 గంటల నుండి ఉదయం 10.30 గంటల వరకు కరీంనగర్‌లోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం సూట్ నంబర్ 3లో అందుబాటులో ఉంటానని ప్రసన్న తెలిపారు. తన ఫోన్ నంబర్ 8977114562కు కూడా ఫిర్యాదు చేయవచ్చని వివరించారు.

రవీందర్‌సింగ్‌పై కేసు నమోదు

కరీంనగర్‌క్రైం: రాష్ట్ర పౌరసరఫరాలశాఖ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్‌పై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ రవికుమార్ తెలిపారు. కరీంనగర్‌లోని ఒక ప్రైవేటు హోటల్‌లో బుధవారం రాత్రి రవీందర్‌సింగ్ ఎటువంటి ముందస్తు అనుమతి లేకుండా ప్రెస్‌మీటింగ్ ఏర్పాటు చేశారు. ఎన్నికల నేపథ్యంలో పోలీసులు చేస్తున్న బైండోవర్లపై మాట్లాడారు. ఎన్నికల నియమాలను ఉల్లంఘించి, ప్రజలను ప్రభావితం చేయడమే కాకుండా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడినందుకు కరీంనగర్ వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.



రవీందర్ సింగ్

అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

- రాబోయేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే
- అర్హులకు రూ.400కే సిలిండర్
- ఎన్నికల ప్రచారంలో మంత్రి గంగుల కమలాకర్



కమలాకర్‌కు బొట్టు పెడుతున్న మహిళ



నగరంలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్/కరీంనగర్‌రూరల్: తాను నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని చూసి ఆశీర్వదించాలని, రాబోయేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని బీఆర్‌ఎస్ కరీంనగర్ అసెంబ్లీ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. సీఎం కేసీఆర్ సుపరిపాలన అందిస్తుంటే, కాంగ్రెస్, బీజేపీలు సీమాంధ్ర పార్టీలతో కుమ్మక్కై తెలంగాణను దోచుకోవడానికి చూస్తున్నాయని మండిపడ్డారు. గురువారం నగరంలోని 28,29,46 డివిజన్ల పరిధిలోని అశోక్‌నగర్ శివాలయం, టవర్‌సర్కిల్‌లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చాకే తాగునీరు, కరెంటు కష్టాలు తొలగాయని వివరించారు. నగరంలో రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు జరిగాయని, సీఎం కేసీఆర్ ఆశీస్సులతో నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేశానని, తనను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మేనిఫెస్టో అమలు చేస్తామని, అర్హులైన పేదలకు రూ.400కే సిలిండర్ అందజేస్తామని వెల్లడించారు. మేయర్ వై.సునీల్‌రావు, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, నాంపల్లి శ్రీనివాస్, వంగల శ్రీదేవి–పవన్, జెల్లోజు శ్రీనివాస్, గోగుల గణేశ్, సముద్రాల మధు, మిర్యాల్‌కర్ నరేందర్, శ్రీరాముల శ్రీకాంత్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన పలువురు

పలువురు బీఆర్‌ఎస్‌లో చేరగా.. మంత్రి కమలాకర్ కండువాలు కప్పి ఆహ్వానించారు. బొమ్మకల్, లక్ష్మినగర్ కుర్మ సంఘం ప్రతినిధులు, కరీంనగర్‌కు చెందిన విశ్వబ్రాహ్మణ కులసంఘం, చింతకుంటకు చెందిన గౌడసంఘం, బుక్క కులసంఘం నేతలు గంగులను కలిసి మద్దతు ప్రకటించారు.

చామనపల్లిలో జీకే యూత్ ప్రచారం

కరీంనగర్ మండలంలోని చామనపల్లిలో గురువారం మంత్రి గంగుల కమలాకర్‌కు మద్దతుగా జీకే యూత్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ టి.లక్ష్మయ్య, సర్పంచు బోగొండ లక్ష్మిబలయ్యలతో కలిసి జీకే యూత్ గౌరవ అధ్యక్షుడు గంగుల ప్రదీప్ ఇంటింటికి తిరుగుతూ మంత్రి గంగుల చేసిన అభివృద్ధి పనుల కరపత్రాలను పంపిణీ చేశారు. జీకేయూత్ మండలాధ్యక్షుడు జక్కు అజయ్, ఎల్లాగౌడ్, సాయికృష్ణ, సతీశ్, అజయ్, నరేశ్, గంగరాజు పాల్గొన్నారు.

కేంద్రం నిధులపై చర్చకు సిద్ధమా?



నగరంలోని సప్తగిరికాలనీలో ఇంటింటా ప్రచారం చేస్తున్న బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ కుమార్

- రెండుసార్లు ఓడిపోయా.. ఒక్క చాన్స్ ఇవ్వండి
- కరీంనగర్ ప్రజలకు బండి సంజయ్ విజ్ఞప్తి

కరీంనగర్‌టౌన్: ఎంపీగా గెలిపిస్తే బండి సంజయ్ కరీంనగర్‌కు చేసిందేమీ లేదంటూ మంత్రి కేటీఆర్, బీఆర్‌ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్ చేస్తున్న దుష్ప్రచారాన్ని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ అసెంబ్లీ అభ్యర్థి బండి సంజయ్ కుమార్ తీవ్రంగా ఖండించారు. గురువారం రాత్రి సప్తగిరికాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 35వ డివిజన్‌లో గాజా రమేశ్ ఆధ్వర్యంలో దాదాపు 500మంది పార్టీలో చేరారు. అనంతరం సంజయ్ మాట్లాడుతూ.. కరీంనగర్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులన్నీ కేంద్రానివేనని స్పష్టం చేశారు. స్మార్ట్‌సిటీ, ఆర్వోబీ, రోడ్లకు నిధులు, డ్రైనేజీ, టాయిలెట్లు సహా పనులన్నింటికీ కేంద్రమే నిధులిస్తోందని అన్నారు. 'కమలాకర్ డేట్, టైం ఫిక్స్‌చెయ్.. అకౌంట్స్ తీసుకుని రా.. నేను ఎంపీగా గెలిచాక కరీంనగర్ అభివృద్ధికి కేంద్రం నుంచి ఎన్ని నిధులు తీసుకొచ్చానో లెక్కలతో సహా వస్తా.. చర్చిద్దాం. సిద్ధమా?' అంటూ సవాల్ విసిరారు. ఎంపీగా తాను కేంద్రం నుంచి వేల కోట్ల రూపాయలు తీసుకొస్తే అన్నీతానే చేసినట్లుగా కమలాకర్ చెప్పుకోవడం సిగ్గుచేటు అని దుయ్యబట్టారు. తనపై ఏకంగా 74 కేసులు పెట్టారని, నిరుద్యోగ యువత కోసం కొట్లాడితే జైల్‌లో పెట్టారని అన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో కరీంనగర్‌లో రౌడీయిజం, గూండాగిరి ఎక్కువైందని, తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే రౌడీయిజాన్ని అంతం చేస్తానని హామీ ఇచ్చారు. రెండు సార్లు ఓడిపోయాను.. ఒక్కచాన్స్ ఇవ్వాలని ప్రజలను కోరారు.



మాట్లాడుతున్న సంజయ్

సంజయ్‌ను విమర్శించే అర్హత బీఆర్‌ఎస్ నేతలకు లేదు

కరీంనగర్ స్మార్ట్‌సిటీ కోసం వేలకోట్ల నిధులు కేంద్రం నుంచి తీసుకువచ్చిన ఎంపీ బండి సంజయ్‌కుమార్‌ను విమర్శించే అర్హత బీఆర్‌ఎస్ నేతలకు లేదని బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి అన్నారు. గురువారం రేకుర్తిలో మాట్లాడుతూ.. కరీంనగర్‌లో సంజయ్ అభివృద్ధి చేయలేదని మేయర్ సునీల్‌రావు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. నాలుగున్నరేళ్లలో రూ.748కోట్లు కేంద్రం నుంచి తెచ్చారని ఈ సందర్భంగా వివరించారు.

క్లుప్తంగా

ఎస్జీఎఫ్‌ ఫుట్‌బాల్‌ జట్ల ఎంపిక పోటీలు



కరీంనగర్‌ స్పోర్ట్స్‌: జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం కరీంనగర్‌లోని సెయింట్‌ జాన్‌ పాఠశాలలో అండర్‌–14 బాలబాలికల ఫుట్‌బాల్‌ జిల్లా జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 16 మండలాల నుంచి 100 మందికి పైగా క్రీడాకారులు హాజరయ్యారు. అంతకుముందు పోటీలను ఎస్జీఎఫ్‌ కార్యదర్శి పోతన శ్రీనివాస్‌ ప్రారంభించారు. జిల్లాస్థాయి పోటీల్లో రాణించిన క్రీడాకారులను పెద్దపల్లి జిల్లాలో జరిగే కరీంనగర్‌ జోన్‌ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. కరీంనగర్‌ అర్బన్‌ స్కూల్‌ గేమ్స్‌ కార్యదర్శి అంతటి శంకరయ్య, పీఈటీ, పీడీలు చంద్రశేఖర్‌, శ్రీనివాస్‌, లక్ష్మణ్‌ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ ప్రచార వాహనం సీజ్‌

జమ్మికుంట(హుజూరాబాద్‌): మండలంలోని కోరపల్లి గ్రామంలో బీఎస్పీ ప్రచార వాహనాన్ని గురువారం సీజ్‌ చేశారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి, డీజే బాక్స్‌లతో అధిక సౌండ్‌తో ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని ఎఫ్‌ఎస్‌టీ జమ్మికుంట ఇన్‌చార్జి వండ్లకొండ ఐలయ్య సదరు వాహనాన్ని పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసినట్లు జమ్మికుంట పట్టణ సీఐ రమేశ్‌ తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌ఎస్‌టీ అధికారులు పాల్గొన్నారు.

ఎస్బీ హెడ్‌కానిస్టేబుల్‌ సస్పెన్షన్‌

కరీంనగర్‌ క్రైం: హోంగార్డును మానసిక వేధింపులకు గురిచేసిన స్పెషల్‌ బ్రాంచి హెడ్‌కానిస్టేబుల్‌ శ్రీనివాస్‌పై సస్పెన్షన్‌ వేటు పడింది. హెడ్‌కానిస్టేబుల్‌ వేధింపులకు గురిచేస్తున్నాడని హోంగార్డు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసు అధికారులు విచారణ జరిపి, సీపీ అభిషేక్‌ మహంతికి నివేదిక అందించారు. ఈ మేరకు గురువారం హెడ్‌కానిస్టేబుల్‌ను సస్పెండ్‌ చేస్తూ ఆయన ఉత్తర్వులు జారీ చేశారు.

కార్పొరేటర్‌పై కేసు?

కరీంనగర్‌ క్రైం: అనుమతి లేకుండా ఎన్నికల ప్రచారం నిర్వహించినందుకు బీఆర్‌ఎస్‌ కార్పొరేటర్‌ గుగ్గిళ్ల జయశ్రీపై కరీంనగర్‌ టూటౌన్‌ పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిసింది. గురువారం ఉదయం కొంతమందితో ఇంటింటి ప్రచారం చేయగా ఎన్నికల పర్యవేక్షణ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైనట్లు సమాచారం.

అమాత్య పదవుల్లో మనోళ్లు

- ఉమ్మడి జిల్లా నుంచి ఇప్పటివరకు 21 మందికి మంత్రిగా అవకాశం
- సీఎం, పీఎంగా పని చేసిన పీవీ
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి అయిన చెన్నమనేని


కేటీఆర్‌


గంగుల కమలాకర్‌


కొప్పుల ఈశ్వర్‌


ఈటల రాజేందర్‌

కరీంనగర్‌ అర్బన్‌: ఉమ్మడి జిల్లాకు 15 సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరగగా ఇప్పటివరకు 21 మందిని అమాత్య పదవి వరించింది. పీవీ నర్సింహారావు రాష్ట్ర ముఖ్యమంత్రిగా, భారత ప్రధాన మంత్రిగా పని చేశారు. బీజేపీ నేత చెన్నమనేని విద్యాసాగర్‌రావు రెండుసార్లు కరీంనగర్‌ ఎంపీగా గెలిచి, అప్పటి ప్రధాని వాజ్‌పేయి కేబినెట్‌లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా చేశారు.

- మంథని నుంచి 1983, 85, 89లలో జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందిన దుద్దిళ్ల శ్రీపాదరావు 1991 నుంచి నాలుగేళ్లపాటు శాసనసభ స్పీకర్‌గా పని చేశారు. ఇదే నియోజకవర్గం నుంచి ఆయన తనయుడు శ్రీధర్‌బాబు 1999, 2004, 2009 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచి, వైఎస్సార్‌, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డిల మంత్రివర్గాల్లో స్థానం దక్కించుకున్నారు.
- పీసీసీ అధ్యక్షుడిగా పని చేసిన ఎం.సత్యనారాయణరావు 2004 ఎన్నికల్లో కరీంనగర్‌ ఎమ్మెల్యేగా విజయం సాధించి, వైఎస్సార్‌ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నారు. ఆర్టీసీ చైర్మన్‌గానూ వ్యవహరించారు.
- 1957లో ఎమ్మెల్యేగా ఎన్నికైన జె.చొక్కారావు (కాంగ్రెస్‌) జలగం వెంగళరావు కేబినెట్‌లో మంత్రిగా వ్యవహరించారు. 1985లో ఇదే స్థానం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన సి.ఆనందరావు(టీడీపీ) ఎన్టీఆర్‌ కేబినెట్‌లో మంత్రిగా పని చేశారు.
- 1994, 99లో నేరెళ్ల(ప్రస్తుతం రద్దు) నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన సుద్దాల దేవయ్య(టీడీపీ) చంద్రబాబు కేబినెట్‌లో మంత్రిగా పని చేశారు. ఇక్కడి నుంచే పాటి రాజం మూడుసార్లు కాంగ్రెస్‌ అభ్యర్థిగా గెలుపొంది, నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి కేబినెట్‌లలో చోటు దక్కించుకున్నారు.
- 1985, 89, 94లలో వరుసగా ఎమ్మెల్యేగా గెలుపొందిన న్యాలకొండ రాంకిషన్‌రావు(టీడీపీ) చంద్రబాబు కేబినెట్‌లో మంత్రిగా పని చేశారు.
- 1978, 83లలో మెట్‌పల్లి(ప్రస్తుతం రద్దు) నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన వర్ధినేని వెంకటేశ్వర్‌రావు(కాంగ్రెస్‌) కోట్ల విజయభాస్కర్‌రెడ్డి కేబినెట్‌లో మంత్రిగా ఉన్నారు.
- 1999, 94లలో టీడీపీ అభ్యర్థిగా విజయం సాధించిన ఇనుగాల పెద్దిరెడ్డి చంద్రబాబు మంత్రివర్గంలో మంత్రిగా పని చేశారు. ఇదే స్థానం నుంచి 2004, 2008(ఉప ఎన్నిక)లలో ఎమ్మెల్యేగా గెలిచిన లక్ష్మీకాంతారావు(టీఆర్‌ఎస్‌) వైఎస్సార్‌ కేబినెట్‌లో మంత్రిగా ఉన్నారు.
- 1985, 89, 94, 99లలో వరుసగా నాలుగుసార్లు కమలాపూర్‌(ప్రస్తుతం రద్దు) నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన ముద్దసాని దామోదర్‌రెడ్డి (టీడీపీ) ఎన్టీఆర్‌ ప్రభుత్వంలో గనుల శాఖ మంత్రిగా చేశారు. 1962, 67లలో కమలాపూర్‌ నుంచి రెండుసార్లు గెలిచిన కె.వి.నారాయణరెడ్డి న్యాయశాఖ మంత్రిగా సేవలందించారు.
- 1989, 1999, 2004లో బుగ్గారం (ప్రస్తుతం రద్దు) నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన కాంగ్రెస్‌ అభ్యర్థి జువ్వాడి రత్నాకర్‌రావు వైఎస్సార్‌ కేబినెట్‌లో మంత్రిగా పని చేశారు.
- 1994, 2009లలో జగిత్యాల ఎమ్మెల్యేగా గెలిచిన టీడీపీ అభ్యర్థి ఎల్‌.రమణ చంద్రబాబు కేబినెట్‌లో మంత్రి పదవి దక్కించుకున్నారు. ఇదేస్థానం నుంచి 1983, 1989, 1996 (ఉప ఎన్నిక), 1999, 2004లలో ఎమ్మెల్యేగా గెలిచిన టి.జీవన్‌రెడ్డి ఎన్టీఆర్‌, వైఎస్సార్‌ మంత్రివర్గాల్లో సేవలందించారు. ఇక్కడి నుంచే 1985లో ఎమ్మెల్యేగా గెలుపొందిన జి.రాజేశంగౌడ్‌(టీడీపీ)ను ఎన్టీఆర్‌ కేబినెట్‌లో మంత్రి పదవి వరించింది.
- కమలాపూర్‌లో రెండుసార్లు, హుజూరాబాద్‌లో ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఈటల రాజేందర్‌ టీఆర్‌ఎస్‌ ప్రభుత్వంలో ఆర్థిక, వైద్యారోగ్య, పౌరసరఫరాల శాఖల మంత్రిగా పని చేశారు. శాసనసభాపక్ష నేతగా వ్యవహరించారు.
- 2009, 2010, 2014, 2018లలో వరుసగా నాలుగుసార్లు సిరిసిల్ల ఎమ్మెల్యేగా గెలిచిన మంత్రి కేటీఆర్‌ను రెండుసార్లు అమాత్య పదవి వరించింది. అలాగే, 2009 నుంచి 2018 వరకు ధర్మపురి ఎమ్మెల్యేగా గెలిచిన కొప్పుల ఈశ్వర్‌ ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రిగా వ్యవహరిస్తున్నారు.
- 2009, 2014, 2018లలో వరుసగా కరీంనగర్‌ ఎమ్మెల్యేగా గెలుపొందిన ప్రస్తుతం గంగుల కమలాకర్‌ బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రిగా ఉన్నారు.

ఎమ్మెల్యేగా పోటీ చేయాలంటే..

కరీంనగర్‌ అర్బన్‌: ఎమ్మెల్యేగా పోటీ చేయాలంటే ఏ అర్హతలుండాలో ఎప్పుడైనా ఆలోచించారా? శాసనసభ స్థానానికి పోటీ చేయాలనుకునే వారికి కేంద్ర ఎన్నికల సంఘం కొన్ని నిబంధనలు విధించింది. అవేంటో తెలుసుకొని, ఉత్సాహం ఉంటే మీరూ పోటీ చేయొచ్చు.

- 25 ఏళ్ల వయసు ఉండాలి. నామినేషన్‌ దాఖలు సమయంలో భారత పౌరుడినని, రాజ్యాంగానికి, భారత సార్వభౌమాధికారానికి లోబడి వ్యవహరిస్తానని ప్రమాణపత్రం జతపర్చాలి.
- రాష్ట్రంలో ఎక్కడో ఓచోట ఓటుహక్కు తప్పనిసరి. సొంత నియోజకవర్గం నుంచి కాకుండా మరోచోట పోటీ చేసే అభ్యర్థి తనకు ఓటుహక్కు ఉన్నట్లు ధ్రువీకరించే పత్రాన్ని నామినేషన్‌కు జతపర్చాలి.
- అభ్యర్థులను ప్రతిపాదించేవారు కచ్చితంగా అదే నియోజకవర్గంలో ఓటరుగా నమోదై ఉండాలి. ఫాం–2బీలో నామినేషన్‌ పత్రాలు దాఖలు చేయాలి.
- రూ.10 వేలు డిపాజిట్‌ చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.5 వేలు చెల్లిస్తే సరిపోతుంది. జనరల్‌ స్థానాల్లో పోటీ చేసే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు సైతం ఈ నిబంధన వర్తిస్తుంది. కుల ధ్రువీకరణ పత్రం సమర్పించాలి.
- జాతీయ, రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందిన పార్టీలు, రాష్ట్రస్థాయిలో రిజిస్టర్‌ అయిన పార్టీల అభ్యర్థులకు నామినేషన్‌ పత్రాల్లో ఒకరు ప్రతిపాదిస్తే సరిపోతుంది. స్వతంత్ర అభ్యర్థిని పది మంది ఓటర్లు ప్రతిపాదించాలి.
- ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల్లో నామినేషన్‌ వేయడానికి అనర్హులు. ముందుగా ఉద్యోగానికి రాజీనామా చేయడంతోపాటు ప్రభుత్వం నుంచి ఆమోదం పొందినవారు మాత్రమే నామినేషన్‌ వేసి, పోటీలో నిలవొచ్చు.

కాంగ్రెస్‌, బీజేపీలవి రెచ్చగొట్టే మాటలు


మాట్లాడుతున్న చైతన్య, పక్కన నాయకులు

- ఎస్‌యూ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు చెన్నమల్ల చైతన్య

సప్తగిరికాలనీ(కరీంనగర్‌): కాంగ్రెస్‌, బీజేపీలు రెచ్చగొట్టే మాటలు మానుకోవాలని శాతవాహన యూనివర్సిటీ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు, బీఆర్‌ఎస్‌ రాష్ట్ర యువజన నాయకుడు చెన్నమల్ల చైతన్య అన్నారు. తెలంగాణ రాకముందు కరీంనగర్‌ ప్రాంత అభివృద్ధి అస్తవ్యస్తం, శూన్యమని తెలిపారు. తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్‌ పాలనలో జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. గురువారం నగరంలోని మంత్రి గంగుల కమలాకర్‌ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్మార్ట్‌సిటీ, ఐటీ కంపెనీ, కేబుల్‌ బ్రిడ్జి, మానేరు రివర్స్‌ ఫ్రంట్‌, మెడికల్‌ కళాశాల, తిరుమల తిరుపతి దేవస్థానం, ఇస్కాన్‌ టెంపుల్‌, రోడ్ల విస్తరణ, ఫుడ్‌ కోర్ట్‌, సర్కస్‌ గ్రౌండ్‌, కొత్త కలెక్టరేట్‌ నిర్మాణం వంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలతో జిల్లా ముందంజలో ఉందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. జేఏసీ, బీఆర్‌ఎస్‌ నాయకులు శనిగరం అరుణ్‌, కుందేటి సత్యనారాయణ, గడ్డమీది రాజశేఖర్‌, మిర్యాల తిరుపతి, గూడూరి కుమార్‌, చారి, గడ్డమీది రాకేశ్‌, బండ అశోక్‌, ములకల విజయ్‌, నగనూరి చంద్రశేఖర్‌, బసవరాజ్‌, అభిలాశ్‌, సూర రామ్‌ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణను దోచుకున్న సీఎం కేసీఆర్‌


మాట్లాడుతున్న కేంద్ర మంత్రి జితేందర్‌సింగ్‌, పక్కన ఎమ్మెల్యే రాజేందర్‌

- కేంద్ర పీఎంవో సహాయ మంత్రి డాక్టర్‌ జితేందర్‌ సింగ్‌

హుజూరాబాద్‌: గత పదేళ్లలో సీఎం కేసీఆర్‌ తెలంగాణ రాష్ట్రాన్ని దోచుకొని, తన కుటుంబాన్ని అభివృద్ధి చేసుకున్నాడని కేంద్ర పీఎంవో సహాయ మంత్రి డాక్టర్‌ జితేందర్‌ సింగ్‌ ఆరోపించారు. గురువారం హుజూరాబాద్‌ బీజేపీ అభ్యర్థి, ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ నామినేషన్‌ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈటల మరోసారి ఎమ్మెల్యేగా గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఆయన ఆధ్వర్యంలో రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

కేసీఆర్‌ను గద్దె దించేందుకే గజ్వేల్‌లో పోటీ

నామినేషన్‌ వేసిన అనంతరం ఎమ్మెల్యే ఈటల ఆర్డీవో కార్యాలయం నుంచి అంబేడ్కర్‌ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్నర్‌ మీటింగ్‌లో మాట్లాడారు. హుజూరాబాద్‌ ప్రజలపై ప్రేమలేక తాను గజ్వేల్‌ పోలేదన్నారు. నరకం చూపించిన కేసీఆర్‌ను గద్దె దించేందుకే అక్కడ పోటీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పైసలను పంచి పెడుతున్నారని ఆరోపించారు. రోడ్లకు ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ అమలుకు గల్లా పట్టుకొని నిలదీయాలని పిలుపునిచ్చారు. మానుకోటలో తమపై బుల్లెట్లు కురిపించిన, తమ రక్తాన్ని కళ్ల చూసిన వారి పేరును అమరవీరుల స్తూపంపై కొట్టించడం బాధాకరమన్నారు. కేసీఆర్‌తో తాను మాత్రమే కొట్లాడగలనని స్వయంగా ప్రధాని మోదీ చెప్పారని తెలిపారు. ఒక బీసీని ముఖ్యమంత్రి చేస్తా అన్నారని, 36 కులాల పెద్దలతో ఆయన మాట్లాడారని పేర్కొన్నారు. హుజూ రాబాద్‌ ప్రజలు ఇంటికో వంద రూపాయలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఎవరికివారే పోటీ చేస్తున్నట్లు పని చేయాలని, తనను నిండు మనసుతో ఆశీర్వదించాలని కోరారు.

'ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలొద్దనే మద్దతు'

విద్యానగర్‌(కరీంనగర్‌): అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా ఉండడానికే కాంగ్రెస్‌కు మద్దతుగా వైఎస్సార్‌టీపీ ఎన్నికల్లో పోటీ చేయడం లేదని ఆ పార్టీ కరీంనగర్‌ పార్లమెంట్‌ కో–ఆర్డినేటర్‌ కంది వెంకటరమణా రెడ్డి తెలిపారు. గురువారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియంతృత్వ ప్రభుత్వం రాకుండా ఉండటం కోసం తమ పార్టీ ఈ నిర్ణయం తీసుకుందన్నారు. రాజకీయం చేయడం కంటే ప్రజల కోసం నిలబడటమే తమ ఆశయమని పేర్కొన్నారు. వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్‌ షర్మిల పార్టీ నాయకులు, కార్యకర్తలతో చర్చించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. నాయకులు రాజేశ్వర్‌, సాదిక్‌ బలాల, రవీందర్‌ రెడ్డి, ఎస్కే.జావిద్‌, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

సారంగాపూర్‌(జగిత్యాల): అర్పపల్లి గ్రామంలో బుక్క రాజిరెడ్డి(53) అనే వ్యక్తి పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. సారంగాపూర్‌ ఎస్సై తిరుపతి కథనం ప్రకారం.. రాజిరెడ్డి చాలాకాలంగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. ఎన్ని మందులు వాడినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స కోసం జగిత్యాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌కు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం తరలించారు. మృతుడికి కుమార్తె, కొడుకున్నారు.

'నా గెలుపునకు సహకరించాలి'

కరీంనగర్‌: కాంగ్రెస్‌ మానకొండూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్‌ కవ్వంపల్లి సత్యనారాయణ గురువారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌కు వచ్చి, తన గెలుపునకు సహకరించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్‌, సీపీఐ మధ్య పొత్తు ఉన్నందున మానకొండూరులో కాంగ్రెస్‌ అభ్యర్థికి సంపూర్ణంగా మద్దతు ప్రకటిస్తున్నట్లు సీపీఐ ఉమ్మడి జిల్లా ఎన్నికల సమన్వయ కమిటీ కన్వీనర్‌ మర్రి వెంకటస్వామి తెలిపారు. శుక్రవారం తాను నామినేషన్‌ వేస్తున్నందున సీపీఐ శ్రేణులు రావాలని కవ్వంపల్లి ఆహ్వానించారు. సమావేశంలో సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల జిల్లాల సీపీఐ కార్యదర్శులు మంద పవన్‌, గుంటి వేణు, రాష్ట్ర కౌన్సిల్‌ సభ్యుడు పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యులు బండ రాజిరెడ్డి, పోతిరెడ్డి వెంకటరెడ్డి, జిల్లా నాయకులు బోనగిరి మహేందర్‌, బ్రాహ్మణపెల్లి యుగంధర్‌, మధు, రాజు, వివిధ మండలాల కార్యదర్శులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఇల్లందకుంట(హుజూరాబాద్‌): మండలంలోని కనగర్తికి చెందిన పర్లపల్లి మధునయ్య (54) చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్‌ఐ రాజ్‌కుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మధునయ్యకు ఆర్థిక ఇబ్బందులున్నాయి. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 8న గడ్డిమందు తాగి, ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబసభ్యులు ముందుగా జమ్మికుంటకు, అక్కడి నుంచి వరంగల్‌ ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు శ్రీకాంత్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.


మధునయ్య (ఫైల్‌)

బస్టాండ్‌లో పోలీసుల తనిఖీలు



కరీంనగర్‌ క్రైం: సీపీ అభిషేక్‌ మహంతి ఆదేశాల మేరకు కరీంనగర్‌ బస్టాండ్‌లో గురువారం రాత్రి టౌన్‌ ఏసీపీ జి.నరేందర్‌ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ మేరకు పలువురు అనుమానితుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొందరి బ్యాగులు చెక్‌ చేశారు. కార్యక్రమంలో సీఐలు రవికుమార్‌, రాంచందర్‌రావు, శ్రీనివాస్‌, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'అల్ఫోర్స్‌'లో ముందస్తు స్వచ్ఛ్‌ దీపావళి



వేడుకల్లో విద్యార్థులతో చైర్మన్‌ నరేందర్‌ రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్‌): కొత్తపల్లిలోని అల్ఫోర్స్‌ ఇ–టెక్నో స్కూల్‌లో గురువారం ముందస్తు స్వచ్ఛ్‌ దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహాలక్ష్మి అమ్మవారి విగ్రహానికి విద్యాసంస్థల చైర్మన్‌ వి.నరేందర్‌ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. టపాకాయలు కాల్చడం వల్ల వెదజల్లే కాలుష్యంతో కలిగే అనర్థాలను పిల్లలకు తెలియజేశారు. ప్రతీ ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపే పండుగే దీపావళి అని చైర్మన్‌ తెలిపారు. ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం ద్వారా మహాలక్ష్మీ అమ్మవారి అనుగ్రహం పొందుతారన్నారు. ప్రిన్సిపాల్‌, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి


రాజేందర్‌ (ఫైల్‌)

మేడిపల్లి: భీమారం మండలం గోవిందారం గ్రామంలో గురువారం సాయంత్రం విద్యుదాఘాతంతో ఒకరు మృతిచెందారు. కోరుట్ల మండలం మోహన్‌రావుపేటకు చెందిన గుండవేని రాజేందర్‌ గోవిందారంలోని అక్క ఇంటికి దీపావళి నోముల సందర్భంగా రంగులు వేయడానికి వెళ్లాడు. రంగులు వేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్‌ తీగలు తగిలి పడిపోగా.. జగిత్యాలలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే రాజేందర్‌ మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య రాజమణి, ఇంటర్‌ చదువుతున్న కూతురున్నట్లు బంధువులు తెలిపారు.

మతిస్థిమితం లేని వృద్ధుడు..

వెల్గటూర్‌(ధర్మపురి): మండలంలోని కిషన్‌రావుపేట గ్రామానికి చెందిన మానాల మల్లయ్య(55) అనే వ్యక్తి మతిస్థిమితం సరిగా లేక వారం రోజుల క్రితం ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. గురువారం సంకెనపెల్లిలోని శ్మశాన వాటిక గదిలో మల్లయ్య మృతదేహం పడి ఉంది. వారం రోజులుగా ఎలాంటి ఆహార పదార్థాలు, నీరు తీసుకోకపోవడంతో మృతిచెంది ఉంటాడని మృతుడి అన్న మానాల ప్రభుదాస్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్వేత తెలిపారు.

స్వగ్రామానికి గల్ఫ్‌ కార్మికుడి మృతదేహం

కోరుట్లరూరల్‌: గుమ్లాపూర్‌ గ్రామానికి చెందిన గల్ఫ్‌ కార్మికుడు బోయిని వెంకటయ్య(53) వారం క్రితం ఖతార్‌లో గుండెపోటుతో మృతిచెందగా.. ఆయన మృతదేహం గురువారం స్వగ్రామం చేరింది. కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. వెంకటయ్య 30ఏళ్లుగా ఖతార్‌ వెళ్లి వస్తున్నాడు. ఏడాదిన్నర క్రితం సెలవుపై వచ్చి వెళ్లిన వెంకటయ్య వారం క్రితం పని చేస్తుండగా గుండెపోటు వచ్చింది. తోటి కార్మికులు వెంటనే ఖతార్‌లోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆసుపత్రిలోనే మృతిచెందాడు. ఈ విషయం వారి కుటుంబ సభ్యులు గల్ఫ్‌ సమితి వారికి చేరవేయగా.. వారు ఐసీబీఎఫ్‌ సహకారంతో మృతదేహాన్ని త్వరగా స్వదేశం తీసుకొచ్చేందుకు కృషి చేశారు. గురువారం వెంకటయ్య మృతదేహం శంషాబాద్‌ విమానాశ్రయానికి చేరుకోగా.. ప్రభుత్వం ఉచిత అంబులెన్స్‌ సౌకర్యం కల్పించింది. గల్ఫ్‌ సమితి సభ్యులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. వెంకటయ్యకు భార్య లక్ష్మీ, ముగ్గురు కూతుళ్లు. అందరికీ వివాహమైంది. వెంకటయ్య కుటుంబానికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని గల్ఫ్‌ సమితి సభ్యులు డిమాండ్‌ చేశారు.

నాటుసారా, మద్యం స్వాధీనం



రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం ఎక్సైజ్‌ పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. బ్రాహ్మణపల్లి తండా నుంచి రామగుండం ఎస్టీ కాలనీకి ద్విచక్ర వాహనంపై నాటుసారా తరలిస్తున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ద్విచక్ర వాహనంతో పాటు 12 లీటర్ల గుడుంబాను సీజ్‌ చేసి నిందితుడు సంపత్‌ను అరెస్ట్‌ చేసి కేసు నమోదు చేశారు. నిందితుడిచ్చిన సమాచారం మేరకు బ్రాహ్మణపల్లి తండాలోని అటవీ ప్రాంతంలో జరిపిన దాడుల్లో 30 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. మరో 350 లీటర్ల బెల్లం పానకం నిలువలను గుర్తించి ధ్వంసం చేశారు. అంతర్గాం మండల పరిధిలోని పలు బెల్ట్‌ షాపుల్లో సోదాలు నిర్వహించగా.. మద్యం కలిగి ఉన్న విక్రయదారులపై నాలుగు కేసులు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో 3(1000ఎంఎల్‌), 78(180ఎంఎల్‌), 28(90ఎంఎల్‌), 4(కేఎఫ్‌ బీర్లు) మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్‌ సీఐ సుంకరి రమేశ్‌ మాట్లాడుతూ.. గుడుంబా, మద్యం తయారు చేసి నిల్వలు కలిగి ఉన్నా, అక్రమంగా రవాణా చేసినా చట్టప్రకారం కఠిన చర్యలు చేపడతామన్నారు. ఎస్సైలు శారద, విజయభాస్కర్‌, సిబ్బంది ఖదీర్‌, ప్రసాద్‌, తిరుపతి, రాజు పాల్గొన్నారు.

ఫ్యాషన్





పట్టుబట్టలతోనే కాదు మనవైన సంప్రదాయ దుస్తులతోనూ వెలిగిపోవచ్చు.
మోడ్రన్ షేర్వాణీలను ధోతీ ప్యాంట్లతో మ్యాచ్ చేయచ్చు.
పర్యావరణ అనుకూలమైన డ్రెస్సులను ఎంచుకోవచ్చు.
పాత కాలం నాటి ప్రింట్లు, హ్యాండ్‌మేడ్ డిజైన్స్‌కి ప్రాధాన్యం ఇవ్వచ్చు.
ఎవర్‌గ్రీన్ లుక్‌తో రాబోయే రోజులను
ప్రకాశవంతంగా మార్చడానికి ఈ దీపావళి నుంచే మొదలుపెట్టవచ్చు.
పండగ రోజున దీపాలనే కాదు
సరికొత్త ట్రెండ్‌తో వార్డ్ రోబ్‌లను కూడా వెలిగించవచ్చు.
ప్రతి వేడుకలోనూ మెరిసిపోవచ్చు.

వార్డ్ రోబ్‌లకూ వెలుగులు



నియో–సంప్రదాయం

పాతకాలం నాటి కుర్తాలు, షేర్వాణీలు ఇప్పుడు కొత్తగా రూపాంతరం చెందాయి. ఈ దీపావళికి ఇవి ఎంతో అందంగా ఉంటాయి. అలాగే, లేయర్డ్ షేర్వాణీలు, ధోతీ ప్యాంట్‌లను ధరించవచ్చు. వీటిని మోడర్న్ డిజైన్, ఓల్డ్ ట్రెడిషన్‌తో మిళితం చేయచ్చు. ఈ మిక్స్ అండ్ మ్యాచ్ వల్ల సొగసైన రూపాన్ని పొందవచ్చు. ఇక నియాన్ కలర్స్ ఇప్పుడు ట్రెండ్‌లో ఉన్నాయి. వీటిలో బ్లూ, రెడ్, గ్రీన్, ఎల్లో కలర్స్ చాలా ప్రకాశవంతంగా ఉంటాయి. ఇవి సాధారణ రంగుల నుండి కాంతివంతంగా కనిపిస్తాయి.

పర్యావరణ అనుకూలం

సరైన అవగాహనతో ఫ్యాషన్ పర్యావరణ అనుకూల బట్టల వైపు మొగ్గు చూపుతోంది. సేంద్రియ పత్తి, వెదురు, జనపనార బట్టలు స్థిరంగా ఉండటమే కాకుండా మట్టి సొబగులను కూడా వెదజల్లుతాయి. సురయ్యా, ఇతర ప్రముఖ బ్రాండ్‌లు ఈ ట్రెండ్‌లో ముందంజలో ఉన్నాయి.



పేస్టల్స్ పెరుగుదల

దీపావళి ప్రకాశవంతమైన రంగులకు పర్యాయపదంగా ఉన్నప్పటికీ, లావెండర్, మింట్, బేబీ పింక్ పేస్టల్ కలర్స్ పండుగ కళను పెంచుతాయి. ఈ రంగులు ప్రశాంతతతోపాటు రిచ్‌నెస్‌ను కళ్లకు కడతాయి.

డిజిటల్ ప్రింట్లు సాంప్రదాయ మూలాంశాలు

సాంకేతికత మన జీవితంలోని ప్రతి రంగాన్నీ ప్రభావితం చేస్తున్నప్పుడు ఫ్యాషన్‌ను మాత్రం ఎందుకు వదిలివేయాలి... అందుకే, లోటస్ లేదా పీకాక్ ఫెదర్స్‌తో కూడిన భారతీయ సంప్రదాయ మూలాంశాలను ప్రదర్శించే డిజిటల్ ప్రింట్లు గొప్పగా కనిపిస్తున్నాయి. ఈ ప్రింట్లు, డిజైన్లు సంప్రదాయానికి ఆధునిక టచ్‌ను అందిస్తున్నాయి.

పాతకాలపు డిజైన్ల పునరుద్ధరణ

బనారసీ సిల్క్స్, చికంకారి ఎంబ్రాయిడరీ, బంధని వంటి పాతకాలపు వస్త్రాల ఆకర్షణ మళ్లీ మళ్లీ ఆకట్టుకుంటుంది. డిజైనర్లు ఈ సంప్రదాయ వస్త్రాలను ఆధునిక దుస్తులలో డిజైన్ చేస్తున్నారు. మనదైన గొప్ప వారసత్వాన్ని దేశీయ కళాకారులు కాపాడుతున్నారు.

చేతితో తయారు చేసిన పాదరక్షలు

పాదరక్షల్లో మన దేశీయ హస్తకళా నైపుణ్యం తనదైన ముద్ర వేస్తోంది. జూతీలు, కొల్హాపురీ, ఎంబ్రాయిడరీ ఇతర అలంకారాలతో చేతితో తయారు చేసిన పాదరక్షలలో దేనిని ఎంపిక చేసుకున్నా పండగ కళ కనిపిస్తుంది. ఇవి కళాకారుల నైపుణ్యానికి నిదర్శనంగా ఉండటమే కాకుండా, వేడుకలో ప్రత్యేకమైన టచ్‌ను అందిస్తాయి.





సమాజానికి మంచి ఆహారాన్నివ్వాలనుకుంది. ఖాద్యమ్... పేరుతో తినదగిన ఆహారాన్నిస్తోంది. 'వరల్డ్ ఫుడ్ ఇండియా'లోనూ నిరూపించుకుంది. దేశ రక్షణ కోసం కొండల్లో గుట్టల్లో డ్యూటీ చేసే సైన్యానికి మంచి ఆహారాన్నిచ్చే బాధ్యత చేపట్టింది. ఈ సందర్భంగా కట్టెకోల మాధవి విజయగాథ.

జై జవాన్‌కు టిఫిన్ బాక్స్

రక్షణరంగంలో విధులు నిర్వర్తించే వారి ఆహారం ఎలా ఉండాలో నిర్దేశించడానికి డీఎఫ్ఆర్ఎల్‌లో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం పని చేస్తూ ఉంటుంది. ఆ ప్రమాణాల మేరకు ఆహారం తయారు చేయడానికి అనుమతి సాధించారు ఓ తెలుగు మహిళ. ఈ అనుమతి సాధించడానికి ముందు ఆమె ఆహారం మీద అంతులేని పరిశోధన చేశారు. భూమిలో నాటే గింజ నుంచి పంట దిగుబడి, దినుసులను ప్రాసెస్ చేయడం, వండి చల్లార్చి డబ్బాల్లో ప్యాక్ చేయడం వరకు ప్రతిదీ ఒక చేతి మీదుగా నడిచినప్పుడే నిర్దేశించిన ప్రమాణాలను పాటించగలమని నమ్ముతారామె. సేంద్రియ పంట, వంటను ఈ నెల న్యూఢిల్లీలో జరిగిన 'వరల్డ్ ఫుడ్ ఇండియా' సదస్సులో ప్రదర్శించి మరోసారి నిరూపించారు. ఈ సందర్భంగా సాక్షితో తన అనుభవాలను పంచుకున్నారు హైదరాబాద్‌లో నివసిస్తున్న కట్టెకోల మాధవి.

రైతులు విచిత్రంగా చూశారు!

మాది సూర్యాపేట. నాన్న ఉద్యోగ రీత్యా నా చదువు మొత్తం హైదరాబాద్‌లోనే. నిజానికి నా చదువుకి, నేనెంచుకున్న ఈ రంగానికి సంబంధమే లేదు. బీఎస్సీ స్టాటిస్టిక్స్ చేసి కొంత కాలం టీచర్‌గా, ఆ తర్వాత బ్యాంకులో ఉద్యోగం చేశాను. మా వారు మైక్రో బయాలజీ చేసి హిమాలయ సంస్థలో ఉద్యోగం చేశారు. నెలలో ఇరవై రోజులు క్యాంపుల ఉద్యోగం ఆయనది. జీవితం ఇది కాదనిపించేది. మన జ్ఞానాన్ని సరిగ్గా ఒకదారిలో పెడితే గొప్ప లక్ష్యాలను సాధించవచ్చనిపించింది. సొంతంగా ఏదో ఒకటి చేయాలనే నిర్ణయానికి 2009లో వచ్చాం. నాలుగేళ్లపాటు సమాజం అవసరాలేమిటి, అందుబాటులో ఉన్న వనరులేమిటి అని అధ్యయనం చేశాం. సమాజంలో ఆరోగ్యకరమైన ఆహారం తప్ప అన్నీ ఉన్నాయని తెలిసింది. మేము 2014లో గ్రామాలకు వెళ్లి రైతులతో కొర్రలు పండిస్తారా అని అడిగినప్పుడు మమ్మల్ని వెర్రివాళ్లను చూసినట్లు చూశారు. కుగ్రామాలకు వెళ్లి మహిళలకు మా ఉద్దేశాన్ని వివరించాం. విత్తనాల నుంచి పంటకు అవసరమైన ఇన్‌పుట్స్ అన్నీ మేమే ఇస్తాం, మీరు పండించిన పంటను మేమే కొంటాం... అని భరోసా ఇచ్చాం. దాంతోపాటు వారు పండించే కంది పంట మధ్య చాళ్లలో చిరుధాన్యాలను పండించమని సూచించాం. ఒక కందిపంట సమయంలో చిరుధాన్యాలు మూడు పంటలు వస్తాయి. తమకు నష్టం ఏమీ ఉండదనే నమ్మకంతోపాటు మామీద విశ్వాసం కలిగిన తర్వాత ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, రాజస్థాన్, సిక్కిం రాష్ట్రాల్లో మొత్తం 1350 మంది మహిళారైతులు మాతో కలిశారు. గ్రౌండ్ వర్క్ చేసిన తర్వాత 2018లో కంపెనీ ఖాద్యమ్‌ని రిజిస్టర్ చేశాం. ఖాద్యమ్ అనే సంస్కృత పదానికి అర్థం తినదగినది అని. పంట నుంచి మా ప్రయోగాలు వంటకు విస్తరించాయి.

వండి చల్లబరుస్తాం!

ఇడ్లీ, సాంబార్, చట్నీ వంటి ఆహార పదార్థాలు యంత్రాల్లోనే తయారవుతాయి. ఉడికిన వెంటనే మైనస్ నలభై డిగ్రీల ఉష్ణోగ్రతకు తీసుకువెళ్లడంతో వాటిలో ఉండే తేమ హరించుకుపోతుంది. ఇలా తయారైన ఆహారం ప్యాకెట్లలో తొమ్మిది నెలల పాటు నిల్వ ఉంటుంది. వేడినీటిలో ముంచితే ఐదు నిమిషాల్లో ఇడ్లీ మెత్తగా మారుతుంది, సాంబార్, చట్నీలు కూడా అంతే. మేము కనుగొన్న విజయవంతమైన ఫార్ములా ఇది. పోహా నుంచి స్పగెట్టీ, పాస్తా వరకు ఒక ఇంట్లో అన్ని తరాల వారూ ఇష్టపడే రుచులన్నింటినీ ఇలాగే చేస్తున్నాం. మొదట్లో రెడీ టూ కుక్ ఉత్పత్తుల మీద దృష్టి పెట్టాం. రోజూ వండి బాక్సు పట్టుకెళ్లడం కుదరని రోజుల్లో రెడీ టూ ఈట్ విధానాన్ని అనుసరించాం. ఆఫీస్‌కి టిఫిన్ బాక్స్ తేలిగ్గా తీసుకెళ్లడానికి, ప్రయాణాల్లో తీసుకెళ్లడానికి మా ఉత్పత్తులు చాలా అనువుగా ఉంటాయి. ఇవన్నీ ఒక ఎత్తయితే సైన్యం అవసరాలకు తగినట్లు ఆహారాన్ని తయారు చేయడం పెద్ద సవాల్ అనే చెప్పాలి. మైసూర్‌లో ఉన్న డీఎఫ్ఆర్ఎల్‌కి ఎన్నిసార్లు వెళ్లామో లెక్క పెట్టలేం. యాభైసార్లకు పైగా వెళ్లి ఉంటాం. విమాన టిక్కెట్ల ఖర్చే లక్షల్లో వచ్చింది. సైంటిస్టులు సూచించిన నియమావళి ప్రకారం తయారు చేయడం, శాంపుల్ తీసుకెళ్లి చూపించడం, వాళ్లు చెప్పిన సవరణలను రాసుకుని హైదరాబాద్ రావడం, మేడ్చల్ దగ్గర బండ మాదారంలో ఉన్న మా యూనిట్‌లో తయారు చేసి మళ్లీ పట్టుకెళ్లడం... ఇలా సాగింది. మా ప్రయోగాల గురించిన ప్రతి వివరాన్నీ నోట్స్ సమర్పించాం. జీవితంలో ఓ గొప్ప లక్ష్యాన్ని సాధించాలనుకున్నాం, ఆ ప్రయాణంలో మేము లక్ష్యాన్ని చేరేలోపు ఉద్యోగంలో సంపాదించుకున్న డబ్బు రెండు కోట్లకు పైగా ఖర్చయిపోయింది. ఏ దశలోనూ వెనుకడుగు వేయకుండా దీక్షగా ముందుకెళ్లడమే ఈ రోజు విజేతగా నిలిపింది. ఏ– ఐడియా వంటి ప్రభుత్వ రంగ సంస్థలు ఆర్థికంగానూ, మౌలిక వసతుల కల్పనలోనూ సహకరిస్తున్నాయి. మా ఉత్పత్తులు ఈ-కామర్స్ వేదికల మీద పన్నెండు దేశాలకు చేరుతున్నాయి. ఢిల్లీలో ఈ నెల మూడు నుంచి ఐదు వరకు 'వరల్డ్ ఫుడ్ ఇండియా' సదస్సు జరిగింది. అందులో స్టాల్ పెట్టమని ప్రభుత్వం నుంచి ఆహ్వానం రావడమే ఈ ప్రయత్నంలో మేము గెలిచామని చెప్పడానికి ఉదాహరణ'' అని వివరించారు ఖాద్యమ్ కో ఫౌండర్ మాధవి.

– వాకా మంజులారెడ్డి
ఫొటో : నోముల రాజేశ్ రెడ్డి

వరల్డ్ ఫుడ్ ఇండియా సదస్సులో...



డీఎఫ్ఆర్ఎల్... డిఫెన్స్ ఫుడ్ రీసెర్చ్ లాబొరేటరీ. కర్నాటక రాష్ట్రం మైసూర్‌లో ఉన్న ఈ సంస్థ డీఆర్‌డీవో (డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్)లో ఒక విభాగం. రక్షణ రంగంలో విధులు నిర్వర్తించే వారికి నిల్వ ఉండే ఆహారాన్ని సరఫరా చేస్తుంది. పర్వత ప్రాంతాలు, లోయలు, గడ్డకట్టే మంచులో ఉండే ఆర్మీ క్యాంపుల్లో విధులు నిర్వర్తించేవారికి తాజా ఆహారాన్ని అందించడం కొన్ని సందర్భాల్లో సాధ్యం కాదు. అలాంటి సమయాల్లో వారి ఆకలి తీర్చేది... ముందుగానే వండి, శీతలపరిచి డబ్బాల్లో నిల్వ చేసిన ఆహారమే. అలా నిల్వ చేసే ఆహారాన్ని తయారు చేయడం అత్యంత క్లిష్టమైన పని. ఆహారం నెలల కొద్దీ నిల్వ ఉండాలి. అందులో పోషకాలు లోపించకూడదు.

వంటిల్లు

వెచ్చటి వెలుగుల్లో తియ్యటి ఘుమఘుమలు

ఇల్లంతా దీపాల సందడి, టపాసుల వెలుగుల్లో చిన్నాపెద్దల చిరునవ్వులతో ఒకటే హడావుడి. స్వీట్లు చేయడానికి ఓపిక, సమయం రెండూ ఉండవు. అయినా పండగపూట మనింట్లో తయారైన తీపి రుచే వేరు. అందుకే సులభంగా చేసుకోదగిన తీపి ఘుమఘుమలతో వచ్చేసింది మనందరి వంటిల్లు....

గుడ్ పారే



కావలసినవి: మైదా – రెండు కప్పులు; నెయ్యి – పావు కప్పు; పాలు – అరకప్పు; బెల్లం – కప్పు; శొంఠి పొడి – టీస్పూను; నూనె – డీప్‌ఫ్రైకి సరిపడా.

తయారీ: మైదాపిండిలో నెయ్యివేసి కలపాలి ● తరువాత గోరువెచ్చని పాలుపోసి ముద్దలా కలిపి ఇరవై నిమిషాలు పక్కన పెట్టుకోవాలి ● ఇరవై నిమిషాల తరువాత పిండిముద్దను రెండు భాగాలు చేయాలి ● ఒక్కో భాగాన్నీ మందపాటి చపాతీలా వత్తుకుని అంగుళం పరిమాణంలో ముక్కలు చేయాలి ● మిగతాపిండిని కూడా ఇదే విధంగా చేయాలి ● ఇప్పుడు సలసల కాగుతోన్న నూనెలో ఈ ముక్కలను వేసి మీడియం మంట మీద వేయించాలి. రెండువైపులా గోల్డెన్ బ్రౌన్ కలర్‌లోకి మారితే పారేలు రెడీ అయినట్లే, వెంటనే తీసేయాలి ● బెల్లాన్ని గిన్నెలో వేసి పావుకప్పు నీళ్లుపోసి స్టవ్ మీద పెట్టాలి. మీడియం మంట మీద బెల్లం కరిగి సిరప్‌లా తయారయ్యేంతవరకు మరిగించాలి ● అడుగు అంటకుండా తిప్పుతూనే ఉండాలి. సిరప్ తయారైన తరువాత శొంఠి పొడివేసి కలిపి దించేయాలి ● వేయించి పెట్టుకున్న పారేలను సిరప్‌లో వేసి కలుపుతూనే ఉండాలి. ఇలా కలుపుతూ ఉండగానే మిశ్రమం మొత్తం చల్లబడి గుడ్ పారేలు అతుక్కోకుండా విడివిడిగా వస్తాయి. ఇప్పుడు తీసి ప్లేటులో వేసి సర్వ్‌చేసుకోవాలి ● గాలి చొరబడని డబ్బాలో వేసి ఉంచితే నెలరోజులపాటు నిల్వ ఉంటాయి.

కాజు పిస్తా రోల్స్



కావలసినవి: జీడిపప్పు – ఒకటిన్నర కప్పులు; పిస్తా పప్పు – ఒకటిన్నర కప్పులు; కండెన్స్‌డ్ మిల్క్ – ఒకటింబావు కప్పులు; గ్రీన్ ఫుడ్ కలర్ – ఐదు చుక్కలు; బటర్ – రెండు టేబుల్ స్పూన్లు; పంచదార పొడి – కప్పు; యాలకులపొడి – పావు టీస్పూను;

తయారీ: జీడిపప్పును దోరగా వేయించి, మెత్తగా గ్రైండ్ చేయాలి. ● గ్రైండ్ అయిన తరువాత జల్లెడపట్టి పొడిని తీసుకోవాలి. ●బాణలిలో వెన్న వేసి వేడెక్కనివ్వాలి. కరిగిన బటర్‌లో కండెన్స్‌డ్ మిల్క్ పోయాలి. ● నిమిషం పాటు పాలను కలుపుతూ ఉండాలి. తరువాత జీడిపప్పు పొడి వేయాలి. ● సన్నని మంటమీద తిప్పుతూ ఐదునిమిషాలు వేయించాలి. తరువాత దించేసి చల్లారనివ్వాలి. ●చేతులకు కొద్దిగా నెయ్యి రాసుకుని జీడిపప్పు మిశ్రమాన్ని ముద్దలా కలిపి పెట్టుకోవాలి. ● ఇప్పుడు పిస్తాపప్పుని దోరగా వేయించి మెత్తగా గ్రైండ్ చేయాలి. ● గ్రైండ్ చేసిన మిశ్రమాన్ని జల్లెడపట్టి మెత్తటి పొడిని తీసుకోవాలి. ● పిస్తా పొడిలో పంచదార పొడి, యాలకుల పొడి, ఫుడ్ కలర్ కొద్దిగా వేడి నీళ్లు చల్లుకుంటూ ముద్దలా కలపాలి. ● ఇప్పుడు జీడిపప్పు ముద్దను రెండు ముద్దలుగా చేసి, ఒక్కో ముద్దను మందపాటి చపాతీలా వత్తుకుని, కాస్త వెడల్పుగా ఉండేలా ముక్కలు కోయాలి. ● పిస్తా ముద్దను చిన్న ఉండలుగా చేసి, వీటిని పొడవాటి రోల్స్‌లా చుట్టుకోవాలి. ● జీడిపప్పు ముక్కపైన పిస్తా రోల్‌ను పెట్టి, జీడిపప్పు ముక్కను రోల్ చేయాలి. ● పిండి ముద్దను మొత్తాన్ని ఇలా రోల్ చేసి, పైన కుంకుమ పువ్వు, సిల్వర్ పేపర్‌తో గార్నిష్ చేస్తే కాజుపిస్తా రోల్స్ రెడీ.

షీర్ పీరా

కావలసినవి: పంచదార – కప్పు; పాలపొడి – రెండు కప్పులు; బాదం పలుకులు – టేబుల్ స్పూను; జీడిపప్పు పలుకులు – టేబుల్ స్పూను; పిస్తా పలుకులు – టేబుల్ స్పూను; కిస్‌మిస్ – టేబుల్ స్పూను; యాలకులు – నాలుగు; నెయ్యి – టేబుల్ స్పూను; గార్నిష్ కోసం.... పిస్తా, బాదం, జీడిపప్పు పలుకులు – టేబుల్ స్పూను (పెద్దసైజువి).

తయారీ: డ్రైఫ్రూట్స్ పలుకులు సన్నగా పొడవుగా ఉండేలా తీసుకోవాలి ● మందపాటి బాణలిలో పంచదార, కప్పు నీళ్లపోసి మంటమీద పెట్టాలి ● తీగపాకం వచ్చేంత వరకు మరిగించాలి ● తీగపాకం వచ్చినప్పుడు సన్నమంటమీద ఉంచాలి ● ఇప్పుడు పాలపొడిని కొద్దికొద్దిగా వేస్తూ ఉండలు లేకుండా కలుపుతూ ఉండాలి ● పాలపొడి దగ్గర పడేంత వరకు కలుపుతూనే ఉండాలి ● దగ్గర పడుతున్నప్పుడు బాదం, జీడిపప్పు, పిస్తా పలుకులు, కిస్‌మిస్ ముక్కలను వేసి కలపాలి ● చివరిగా యాలకులను పొడిచేసి వేయాలి ● ప్లేటుకును నెయ్యి రాసి ఈ మిశ్రమాన్ని వేయాలి ● ప్లేటంతా సమంగా పరుచుకుని పైన కొద్దిగా పిస్తా, బాదం, జీడిపప్పు పలుకులు చల్లాలి ● స్పూను పెట్టి పైన కూడా సమంగా వత్తుకుని ప్లేటుని రిఫ్రిజిరేటర్‌లో పెట్టాలి ● రెండు గంటల తరువాత నచ్చిన ఆకారంలో ముక్కలు కట్‌చేసి సర్వ్ చేసుకోవాలి.



చిరోటీ



కావలసినవి: మైదా – ఒకటింబావు కప్పులు; సూజీ రవ్వ – కప్పు; నెయ్యి – రెండు టేబుల్ స్పూన్లు; ఉప్పు – చిటికెడు; నూనె – డీప్‌ఫ్రైకి సరిపడా; పంచదార – అరకప్పు; యాలకులు – మూడు; పిస్తా తురుము గార్నిష్‌కు సరిపడా.

పేస్టుకోసం: బియ్యప్పిండి – రెండు టేబుల్ స్పూన్లు; నెయ్యి – మూడు టేబుల్ స్పూన్లు.

తయారీ: కప్పు మైదా, సూజీరవ్వ, ఉప్పుని ఒక గిన్నెలో వేసి కలిపి పెట్టుకోవాలి ● బాణలిలో నెయ్యి వేసి వేడెక్కనివ్వాలి. కాగిన నెయ్యిలో కలిపి పెట్టుకున్న మైదా మిశ్రమాన్ని వేసి వేయించాలి. ● రెండు నిమిషాల తరువాత నీళ్లు చల్లుకుంటూ పూరీ పిండిలా కలుపుకోవాలి. ● పిండి ముద్ద తయారయ్యాక దానిపై తడిబట్టని కప్పి రెండుగంటలు పక్కన పెట్టుకోవాలి. ● ఇప్పుడు పంచదార, యాలకులను మిక్సీజార్‌లో వేసి మెత్తగా పొడిచేయాలి. ● కరిగించిన నెయ్యిని బియ్యప్పిండిలో వేసి, పేస్టులా కలిపి పెట్టుకోవాలి. ● రెండు గంటల తరువాత పిండి ముద్దను మరోసారి బాగా కలిపి దానిని చిన్నచిన్న ఉండలుగా చేయాలి. ● ఒక్కో ఉండను చపాతీలా వత్తుకోవాలి. ● మూడు చపాతీలు చేసిన తరువాత... ఒకదాని మీద ఒకటి పెట్టి పై చపాతీపైన టీస్పూను బియ్యప్పిండి పేస్టుని రాయాలి. తరువాత కొద్దిగా మైదాను చల్లాలి. ● ఇప్పుడు చపాతీని మడతలు వేయాలి. ఒక్కో మడతకు టీ స్పూను బియ్యప్పిండి పేస్టు, కొద్దిగా మైదాను చల్లుకుంటూ చపాతీ మొత్తాన్ని మడత వేయాలి. ● పూర్తయ్యాక చపాతీ రోల్స్‌ను అంగుళం ముక్కలుగా కట్ చేయాలి ● ఒక్కోముక్కను గుండ్రంగా చేసి పూరీలా వత్తుకోవాలి ● మరీ పలుచగా లేదా మరీ మందంగా కాకుండా ఒక మాదిరిగా వత్తుకుని మధ్యలో చిన్న రంధ్రం చేయాలి ● ఇప్పుడు ఈ చపాతీలను సలసల కాగుతోన్న నూనెలో వేసి మీడియం మంట మీద లేత బంగారు వర్ణంలోకి మారేంత వరకు వేయిస్తే చిరోటీ రెడీ ● చిరోటీలను ఒకదానిమీద ఒకటి పేర్చి, పైన పంచదార పొడి, పిస్తా తురుము చల్లి సర్వ్ చేసుకోవాలి.